క్లుప్తంగా

దుర్గాలమ్మకు విశేష పూజలు



అమ్మవారికి పూజ చేస్తున్న అర్చకులు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ కూడలి 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని శ్రీ దుర్గాలమ్మ–శ్రీ బంగారమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు కావటంతో అర్చకులు విశేష పూజలు జరిపించారు. విష్వక్సేన, పుణ్యాహవచనం, కుంకుమ పూజ చేసిన అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి కీర్తనలు ఆలపిస్తూ పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహక కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బుజ్జి, జగన్, సతీష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఇద్దరు ఆకతాయిలకు కౌన్సెలింగ్

మల్కాపురం : కళాశాలకు వెళ్తున్న విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఇద్దరు ఆకతాయిలను పోలీసులు అదుపులోకి తీసుకుని హెచ్చరించారు. జీవీఎంసీ 61వ వార్డు సెయింట్ ఆన్స్ మహిళ కళాశాలకు వెళ్లే మార్గంలో మంగళవారం ఉదయం ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి మాటు వేశారు. ఆ సమయంలో అటువైపు వెళ్తున్న విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించారు. దీనిపై మల్కాపురం పోలీసులకు సమాచారం అందడంతో అక్కడకు వచ్చి యువకులను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ చేశారు. వారు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో హెచ్చరించి చిరునామాలు తీసుకున్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



నగదు అందజేస్తున్న ఆనంద్ కుమార్

విశాఖ విద్య: వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ ఆడారి ఆనంద్ కుమార్ మంగళవారం అందజేశారు. జీవీఎంసీ 90వ వార్డు గవరవీధికి చెందిన మజ్జి మధుసూదన్(45) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబానికి ఆర్థికపరంగా అండగా నిలవాలన్న ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు నమ్మి శ్రీను ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వైఎస్సార్ బీమా పథకం రూ.1 లక్ష సకాలంలో మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించి తక్షణ సాయం కింద మంజూరైన రూ.10 వేలు నగదును ఆనంద్ కుమార్ చేతులమీదగా మృతుడి సోదరుడు మజ్జి జనార్దనకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు చుక్కా ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాకవుట్‌కు సీనియర్ వుమెన్ జట్టు



ఆంధ్ర సీనియర్ వుమెన్ జట్టు

విశాఖ స్పోర్ట్స్: బీసీసీఐ సీనియర్ వుమెన్ క్రికెట్ నాకవుట్‌కు ఆంధ్ర జట్టు అర్హత సాధించింది. టీ20 ట్రోఫీ లీగ్ దశలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఆంధ్ర మహిళా జట్టు ఐదింట విజయాలు సాధించింది. నవంబర్ మూడో తేదీనుంచి నాకవుట్ పోటీలు ప్రారంభం కానుండగా తొలి మ్యాచ్‌లో ముంబయ్‌తో తలపడనుంది. ఈ సందర్భంగా జట్టును ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథరెడ్డి అభినందించారు.

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం

- వైద్యరంగానికి సీఎం ప్రాధాన్యం
- పేదలకు చేరువైన వైద్యం
- డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



60వ వార్డులోని శిబిరంలో రోగులకు కిట్లు అందిస్తున్న నాయకులు



52వ వార్డులోని శిబిరంలో ఐసీడీఎస్ స్టాల్‌లో పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్



వృద్ధురాలిని పరీక్షిస్తున్న జనరల్ ఫిజీషియన్



వైద్య సేవలు అందిస్తున్న గైనకాలజిస్ట్

విశాఖ విద్య: ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 52వ వార్డు శాంతినగర్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీ.ఎస్.కృష్ణతో కలసి మంగళవారం ప్రారంభించారు. శిబిరంలో సౌకర్యాలను పరిశీలించి, సచివాలయ, జీవీఎంసీ, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. శిబిరంలో శ్రీధర్, బీ.ఎస్.కృష్ణ బీపీ పరీక్ష చేయించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికీ కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుంటోందన్నారు. వివిధ వ్యాధులకు సంబంధించిన వైద్య నిపుణులు శిబిరాలకు వచ్చి సేవలు అందిస్తున్నందున, ఎక్కువ మంది ప్రజానీకం సద్వినియోగం చేసుకునేలా విస్తృతమైన ప్రచారం చేయాలన్నారు. దీనిపై సచివాలయ, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు తగిన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జియ్యాని మారుతీ, సచివాలయ అడ్మిన్ రాజు తదితరులు పాల్గొన్నారు. పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్ కుమార్ సహకారంతో వైద్య శిబిరానికి వచ్చిన ప్రతీ ఒక్కరికి భోజనం అందించారు.

60వ వార్డులో 210 మందికి..

మల్కాపురం: 60వ వార్డు ఇందిరాకాలనీ పరిధి సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కొనసాగుతోంది. నాలుగో రోజు జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వైద్య నిపుణులు పాల్గొని, రోగులకు వైద్య సేవలను అందించారు. సుమారు 210 మంది రోగులు సేవలు పొందారు. అనంతరం రోగులకు 58, 59, 60 వార్డుల క్లస్టర్ అధ్యక్షుడు అంగ రామ్ ప్రసాద్, వార్డు సీనియర్ నాయకులు జీవీఎల్ నరేష్, ఆడారి హరీష్ తదితరులు కిట్లు పంపిణీ చేశారు.

వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న భాగ్యలక్ష్మి



వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారితో కళాశాల సిబ్బంది

మల్కాపురం : భారతదేశంలో 562 సంస్థానాలను విలీనం చేసి అఖండ భారతావనిని సృష్టించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ చిరస్మరణీయుడని ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రొగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళ కళాశాలలో పటేల్ జయంతి మంగళవారం నిర్వహించారు. ముందుగా ఆమె వల్లబాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. అనంతరం మాట్లాడుతూ పటేల్ దూరదృష్టి, నిజాయితీ గల సమర్థవంతమైన నాయకుడని కొనియాడారు. భారతదేశ మొదటి ఉప ప్రధానిగా దేశానికి విశిష్ట సేవలు అందించారన్నారు. అనంతరం పటేల్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు.

గోపాలపట్నం: నరవ బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య మాట్లాడుతూ దేశ సారభౌమత్వాన్ని, ఐక్యతను విద్యార్థుల్లో పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. అనంతరం విద్యార్థులతో ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు ఎన్.కామేష్ కుమార్, కె.కామేశ్వరరావు, అధ్యపకులు వంశీకృష్ణ, లిఖిత, సుజాత, కిరణ్ బేడీ పాల్గొన్నారు.

- నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వసతిగృహంలో నిరాశ్రయులకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య: ఎన్ఏడీ కూడలి 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహంలో ఆలిండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ ట్రస్టు నిర్వాహకులు దుస్తులు పంపిణీ చేసి, అన్నదానం చేశారు. ఆశ్రయంలో వసతి పొందుతున్న వారంతా ఆరోగ్యవంతంగా ఉండాలని ప్రార్థనలు చేశారు. జయశీలి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ తరపున సార్వత్రిక క్రీస్తు సంఘ, స్త్రీ సమాజం సభ్యులు దీనిలో పాల్గొన్నారు. బీవోయూఐ డైరెక్టర్ సుందరరావు జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు కమిటీ అధ్యక్షురాలు సుజాత తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అరుణ, వసంత జీవన్, వై షీబా, షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత పాల్గొన్నారు.

'మమత'కు సత్కారం

మమత చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు ఎల్లేటి మమతను ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ ట్రస్టు అధ్యక్షులు వసంత జీవన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఆమె సేవలను కొనియాడారు. మమత చారిటబుల్ ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించటంతో పాటు, నిరాశ్రయుల కేంద్రం మేనేజర్‌గా మమత అందిస్తున్న సేవలు అమోఘమన్నారు.

యోగ సాధకులకు అవార్డులు



విజేతలతో యోగా గురువు కనకరావు

ఉక్కునగరం: యోగా పోటీల్లో స్టీల్‌ప్లాంట్ యోగ సాధకులకు అవార్డులు లభించాయి. ఆంధ్రా యూనివర్సిటీ యోగా విలేజ్ వేదికగా ఆదివారం నిర్వహించిన ఉత్తర కోస్తా జిల్లాల యోగా పోటీల్లో ఉక్కునగరం యోగా గురువు కనకరావు శిష్యులు 15 మంది పాల్గొనగా, 8 మంది విజేతలుగా నిలిచారు. వివిధ విభాగాల వారిగా పిల్లలకు, మహిళలకు, పురుషులకు వేర్వేరుగా నిర్వహించిన ఈ పోటీల్లో ఇద్దరు ప్రథమ బహుమతిని, ఇద్దరు ద్వితీయ బహుమతిని మిగిలినవారు ఇతర బహుమతులను గెలుచుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఉక్కునగరం యోగా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో విజేతలను కనకరావు అభినందించారు.

నడక, పరుగు అలవాటు పెంచేందుకే ఫ్రీడమ్ రన్



ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్‌లో పాల్గొన్న వాసీవా, ఏపీఐఐసీ ఐలా, డీఐసీ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని విశాఖపట్నం ఎంఎస్ఎంఈ – డీఎఫ్‌వో ఆధ్వర్యంలో ఏపీఐఐసీ ఐలా, వాసీవా, డీఐసీ సంయుక్తంగా ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 4.0ను నిర్వహించాయి. మంగళవారం ఆటోనగర్ వాసీవా భవనం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 40 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. ఎంఎస్ఎంఈ ఏడీ చంద్రమౌళి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం, గాంధీ జయంతిల ప్రాముఖ్యతను పురస్కరించుకుని యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ 2020లో ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ ప్రారంభించిందని చెప్పారు. మెరుగైన ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం ప్రజల్లో నడక, పరుగు అలవాటును పెంపొందించడమే ఈ రన్ లక్ష్యం అన్నారు. ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ నాల్గవ ఎడిషన్ ఈ సంవత్సరం స్వచ్ఛ భారత్, స్వస్థ భారత్ థీమ్‌తో ఫిట్ ఇండియా స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్‌గా అక్టోబర్ 1 నుంచి 31 వరకు నిర్వహించినట్టు తెలిపారు. ఎంఎస్ఎంఈ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ బి.ఎ.ఎ.వి.ప్రభాకర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు ఎస్.ఎల్.ఎన్. కుమార్, వీరయ్య, రేవతి, వినోద్, సుబ్బారావు, సన్యాసిరావు, ఐలా చైర్మన్ రఘు, వైస్ చైర్మన్ కోల్లి ఈశ్వరరావు, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, డీఐసీ జీఎం సీహెచ్ గణపతి, ఫ్యాప్సీ అధ్యక్షుడు మురళీ కృష్ణ, వాసీవా ప్రతినిధులు రాంప్రసాద్, పర్చూరు ప్రభాకర్, అనార్‌బాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి'



హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయుసీ నాయకులు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో స్థానిక నిరుద్యోగులకు ప్రాధాన్యం కల్పించాలని ఏఐటీయూసీ ప్రతినిధి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ అంశంపై హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద యూనియన్ సభ్యులతో కలిసి మంగళవారం నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సంస్థలో వేల కోట్లతో విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు స్థానికంగా గల పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగులకు 70 శాతం ఉపాధి కల్పించాలని ఆదేశాలు జారీ చేసినా, వాటిని యాజమాన్యం బేఖాతర్ చేస్తోందని ఆరోపించారు. విస్తరణ పనుల్లో స్థానికులకు ఉపాధి కల్పించకుంటే తమ యూనియన్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమానికి ముందు గేటు వద్ద వారు ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిచారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు కాండ్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు, సత్యనారాయణ, అజేయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి రక్షణకు చర్యలు



మధురవాడ రెవెన్యూ లే అవుట్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

మధురవాడ: విశాఖ రూరల్ మండలంలో 200 గజాల ప్రభుత్వ భూమి పరిరక్షణకు రెవెన్యూ అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. ఈ స్థలం వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. జీవీఎంసీ 8వ వార్డు రెవెన్యూ కాలనీలోని మధురవాడ సర్వే నంబరు 289లో ప్రభుత్వ గెడ్డ వాగు స్థలంలో 200 గజాలలో కొద్ది రోజుల క్రితం అనధికారకంగా ఒక షెడ్ ఏర్పాటు చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు స్థానికులు ఫిర్యాదు చేయడంతో వారి ఆదేశాల మేరకు తొలగించినట్టు ఆర్ఐ ప్రవీణ్ కుమార్ చెప్పారు. ఇక్కడ సుమారు 800 గజాలు ప్రభుత్వ భూమిలో మరో ఆరు షెడ్లు ఉన్నట్టు గుర్తించామని, వారికి కూడా నోటీసులు ఇచ్చి తొలగిస్తామని ఆయన చెప్పారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని తెలిపారు.

10 నుంచి చెకుముఖి సంబరాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ జ్యోతి కుమారి, డీఈవో చంద్రకళ తదితరులు

మధురవాడ: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి చెకుముఖి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.కె.పరశురామ్ తెలిపారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఈ వేడుకలకు సంబంధించి పోస్టర్‌ను విద్యాశాఖ ఆర్జేడీ జ్యోతి కుమారి, డీఈవో చంద్రకళ, సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరశురామ్ మాట్లాడుతూ ఈ నెల 10న పాఠశాల స్థాయి, 30న మండల స్థాయి, డిసెంబర్ 17న జిల్లా స్థాయి, జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. చినగదిలి ఎంఈవో రవీంద్రబాబు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోటాన శ్రీనివాస్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు దేముడుబాబు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమం మరో మైలురాయి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: అకుంఠిత దీక్షతో కార్మికుల భవిష్యత్తు కోసం చేస్తున్న ఉక్కు ఉద్యమం దేశంలో మరో మైలురాయిగా నిలుస్తుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న దీక్షలు మంగళవారానికి 992వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన కోక్‌ఓవెన్ విభాగ కార్మికులతో పాటు ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తుల చేతికి ఇస్తే కార్మికుల భవిష్యత్తు ఏంటని ప్రశ్నించారు. కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ప్రజల ఆగ్రహంతో ఉన్నారని, రానున్న ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం నేర్పుతారని అన్నారు. దేశంలో అగ్రగామిగా నిలిచిన విశాఖ ఉక్కును చిన్నచూపు చూడడం సరి కాదన్నారు. వెంటనే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

మహిళా ఓటర్లే అధికం..!

- సచివాలయాలకు ముసాయిదా జాబితా
- రాజకీయ పార్టీల నాయకులకు అందజేత
- కొత్త ఓటర్ల నమోదుకు స్పెషల్ డ్రైవ్





ఓటరు జాబితా తరలిస్తున్న సిబ్బంది

విశాఖ విద్య: విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. ఎన్నికల కమిషన్ తాజాగా ప్రకటించిన జాబితా మేరకు నియోజకవర్గంలో పురుషుల కంటే 1292 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఇతరులు (థర్డ్ జండర్) 18 మంది ఉన్నట్లు ప్రకటించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు కల్పించటంతోపాటు, బోగస్ ఓట్లు తొలగించేలా అధికార యంత్రాంగం ప్రత్యేక ఫోకస్ పెట్టింది. పశ్చిమ నియోజకవర్గానికి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా విశాఖపట్నం ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్ వ్యవహరిస్తున్నారు. ఓటరు జాబితాకు తుదిరూపు ఇచ్చేందుకు ఏం చేయాలనే దానిపై ఇప్పటికే రెవెన్యూ అధికారులు, బీఎల్‌వోలతో రెండు రోజుల క్రితం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీనికి కొనసాగింపుగా గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లు, ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు, జీవీఎంసీ 5, 8వ జోనల్ కమిషనర్లు సమావేశంలో పాల్గొన్నారు. గుర్తింపు ఉన్న ఏడు రాజకీయ పార్టీల నాయకులకు సమావేశానికి హాజరుకావాలని సమాచారమివ్వగా, కొంతమంది గైర్హాజరయ్యారు. ఆర్డీవో సెలవులో ఉండటంతో వచ్చే మంగళవారం మరోమారు సమావేశమయ్యేందుకు నిర్ణయించినట్లు గోపాలపట్నం తహసీల్దార్ జయ తెలిపారు.

పశ్చిమ నియోజకవర్గం ముఖచిత్రం ఇదీ	
మొత్తం ఓటర్లు	2,21,340
మహిళా ఓటర్లు	1,11,307
పురుష ఓటర్లు	1,10,015
థర్డ్ జండర్	18
పోలింగ్ స్టేషన్లు	220

నియోజకవర్గంలో 220 పోలింగ్ స్టేషన్లు

పశ్చిమ నియోజకవర్గంలో 220 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. గతంలో 237 పోలింగ్ స్టేషన్లు ఉండగా, కొన్ని గాజువాక నియోజకవర్గంలో విలీనం కాగా, ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా మరికొన్నింటిని కుదించారు. 2023 జనవరి 5 నాటి జాబితా మేరకు నియోజకవర్గంలో 2,34,917 మంది ఓటర్లు ఉండగా, తాజా లెక్కల ప్రకారం ఈ సంఖ్య 2,21,340కు తగ్గింది. ఒక చోట నుంచి ఇంకో చోటకు తరలివెళ్లిన వారు, మరణించిన వారు, వేర్వేరు పోలింగ్ స్టేషన్లలో రెండేసి ఓట్లు ఉన్న వారిని తొలగించడంతో గతంలో కంటే ఓటర్లు తగ్గినట్లు గోపాలపట్నం ఎన్నికల సెల్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సచివాలయ స్థాయిలో తాజా ఓటరు జాబితాపై నిశిత పరిశీలన చేస్తున్నామన్నారు. జాబితాల పరిశీలన కోసమని గుర్తింపు గల రాజకీయ పార్టీలకు మంగళవారం ఓటరు జాబితాలను అందజేశారు.

అర్హులందరికీ ఓటు హక్కు



అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా ఓటరు జాబితాల పరిశీలన, రాజకీయ పార్టీలతో ప్రతీ మంగళవారం సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల అభ్యంతరాలపై కూడా పరిశీలన చేస్తున్నాం. ఓటు హక్కు పొందేలా అందరికీ తెలియజేసేలా సచివాలయ స్థాయిలో జాబితాను ప్రదర్శించాం.

– కె.జయ, తహసీల్దార్, గోపాలపట్నం

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రేష్మ ప్రతిభ



రేష్మను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మురళీధర్ తదితరులు

సబ్బవరం: జూనియర్ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని ఎస్.రేష్మ ప్రతిభ చూపింది. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన ఈ పోటీల్లో ఆంధ్రా జట్టు తరపున ఆమె ప్రాతినిధ్యం వహించింది. గోవా జట్టుతో జరిగిన తుది పోరులో ఆంధ్రప్రదేశ్ జట్టు ఓటమి చెంది ద్వితీయస్థానంలో నిలిచింది. తుది పోరులో రేష్మ ప్రతిభ చూపి, కళాశాలకు గుర్తింపు తీసుకొచ్చిందని ప్రిన్సిపాల్ పి.మురళీధర్ తెలిపారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కె.వి. రమణారావు, ఇతర ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

ఉత్సాహంగా వాకథాన్



జెండా ఊపి వాకథాన్ ప్రారంభిస్తున్న సీఎండీ, డైరెక్టర్లు

ఉక్కునగరం: విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్–2003లో భాగంగా స్టీల్‌ప్లాంట్‌లో మంగళవారం నిర్వహించిన వాకథాన్ ఉత్సాహంగా జరిగింది. స్పోర్ట్స్ విభాగం, విజిలెన్స్ విభాగాలు సంయుక్తంగా ఈ వాకథాన్ నిర్వహించాయి. స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ కరుణ రాజు, ఉక్కు మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి సంజయ్ రాయ్, ఖుద్రేముఖ్ ఐరన్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ టి. సమీనాథన్, మోయిల్ సీఎండీ ఎ.కె. సక్సేనా, స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు డి.కె.మొహంతి, పాండేలు జెండా ఊపి వాకథాన్ ప్రారంభించారు. అనంతరం గాల్లోకి బెలూన్లు వదిలారు. ఉక్కు స్టేడియం నుంచి సెక్టర్–6 అంబేడ్కర్ పార్కు వరకు వాకథాన్ సాగింది. కార్యక్రమంలో ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.